



జ్ఞానాపురంలో టీడీపీ కార్యకర్త మల్లిరెట్టి రమణ కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం ప్రజలకు నమస్కరిస్తున్న నారా భువనేశ్వరి

మందకొడిగా ధాన్యం సేకరణ

జిల్లాలో 50 వేల టన్నులు సేకరించాలని లక్ష్యం

- 144 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు
- ఇప్పటి వరకు 2,120 టన్నుల ధాన్యం మాత్రమే సేకరణ
- తుఫాన్ కారణంగా ఆలస్యమైందంటున్న అధికారులు
- గత అనుభవాలతో ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్న రైతులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)



గొలుగొండ మండలం ఏటిగైరంపేటలో వరి పంటను నూర్చుతున్న రైతులు

జిల్లాలో ధాన్యం సేకరణ నత్తనడకన సాగుతోంది. ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్లకు అధికారులు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసినా.. కార్యరూపంలోకి వచ్చే సరికి ఫలితం లేకుండా పోయింది. గత నెలలో సంభవించిన తుఫాన్ కారణంగా వరి కోతలు, నూర్పులు కొంత ఆలస్యమైనప్పటికీ, రెండు వారాల నుంచి నూర్పిడి పనులు జోరుగా సాగుతున్నాయి. ధాన్యం అమ్మడానికి రైతులు సిద్ధంగా వున్నప్పటికీ అధికారులు మాత్రం కొనుగోళ్ల ప్రక్రియను మొదలుపెట్టలేదు. రైతుల నుంచి ధాన్యం నమూనాలను సేకరించడం లేదు. దీంతో కల్లాల్లోనే ధాన్యం వుంచుకుని రోజూ కాపాలా కాయాల్సి వస్తున్నదని రైతులు వాపోతున్నారు. కొంతమంది రైతులు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం అమ్ముకుంటున్నారు.

గత ఖరీఫ్ సీజన్‌లో జిల్లా రైతులు... ముఖ్యంగా వరి సాగుదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వరినాట్లు నాట్లు సమయంలో వర్షాభావ పరిస్థితులు, పంట చేతికి వచ్చే సమయంలో విరుచుకుపడి తుఫాన్ కష్ట, నష్టాలను మిగిల్చాయి. గత నెల మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలతో వేలాది ఎకరాల్లో వరి పైరు నీట మునిగింది. అప్పటికే కోత కోసి, కుప్ప వేయని పొలాల్లో వరి పనలు తడిసిపోయి, నీటిలో కొట్టుకుపోయాయి. లోతట్టు ప్రాం తాల్లో వరి పంట కుళ్లిపోయి, కంకులు మొలకెత్తాయి. కాగా నీటి సదుపా యం వున్న భూముల్లో వరి పంట ఆశాజ నకంగానే పండడంతో 70 వేల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికా రులు అంచనా వేశారు. దీంతో రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు జిల్లా పౌర సరఫరాల సంస్థ చర్యలు చేపట్టారు. జిల్లాలో 144 ధాన్యం కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు నవంబరు లోనే ప్రకటించారు. కానీ డిసెంబరు మొదటి వారంలో తుఫాన్ కారణంగా వేలాది ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లడంతో ధాన్యం దిగుబడి 50 వేల టన్నులకు మించి వచ్చే పరిస్థితి లేదని వ్యవసాయ శాఖ అధికారులు భావించారు. దీంతో ధాన్యం సేకరణను పౌర సరఫరాల సంస్థ అధికారులు కొద్ది రోజులపాటు వాయిదా వేశారు. ఇదిలావుండగా తుఫాన్ కారణంగా వరి కోతలు, నూర్పిళ్లు ఒకింత ఆలస్యం అయ్యాయి. రెండు వారాల నుంచి నూర్పిడి పనులు ఊపందుకున్నాయి. ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశామని అధికా రులు చెబుతుండగా, ప్రజాప్రతినిధులు ఆర్భాటంగా ప్రారంభిస్తున్నారు. కానీ రైతుల నుంచి ధాన్యం సేకరణ అంతంతమాత్రంగానే జరుగు తున్నది. జిల్లాలో శుక్రవారం వరకు 2,120 టన్నుల ధాన్యాన్ని మాత్రమే సేకరించారు. డబ్బు చెల్లింపుల్లో గత ఏడాది అనుభవాలను దృష్టిలో పెట్టుకుని కొంతమంది రైతులు ప్రభుత్వానికి కాకుండా ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం విక్రయిస్తున్నారు.

ఇదిలావుండగా ఈ-కేవైసీ నమోదు చేయించుకుంటేనే ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం నిబంధన విధించడంతో ఆర్‌బీకేల్లో ఈ-కేవైసీ చేయించు కోలేని రైతులు కూడా ప్రైవేటుగానే ధాన్యం అమ్ముకుంటున్నారు.



గొలుగొండ మండలం పాతమల్లంపేటలో వరి పంటను నూర్చి, ధాన్యాన్ని బస్తాల్లోకి నింపిన దృశ్యం

ధాన్యం సేకరణ వేగవంతం చేస్తాం

జిల్లాలో ధాన్యం సేకరణను వేగవంతం చేస్తాం. రైతులు ఎంత ధాన్యం తెచ్చినా కొనుగోలు చేస్తాం. తుఫాన్‌కు ముందు 70 వేల టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశాం. కానీ తుఫాన్ వల్ల పలుచోట్ల పంట దెబ్బతిన్నది. దీంతో సేకరణ లక్ష్యం కొంత తగ్గవచ్చు. ధాన్యం విక్రయించిన రైతులకు నిర్ణీత సమయంలో బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించుకోవాలి.

- **పి.జయంతి,** జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్

పార్టీ అండగా ఉంటుంది

చంద్రబాబునాయుడు అరెస్టును జీర్ణించుకోలేక మృతిచెందిన వారి కుటుంబాలకు నారా భువనేశ్వరి భరోసా

- మృతుల కుటుంబాలకు పరామర్శ
- కష్టకాలంలో తమ కుటుంబానికి అండగా నిలవడంతో పాటు పార్టీ అభివృద్ధికి శ్రమిస్తున్న వారందరికీ తోడుగా ఉంటామని ప్రకటన
- విశాఖలో 'నిజం గెలవాలి' యాత్ర



దక్షిణ నియోజకవర్గ పరిధిలోని వెంకటేశ్వర మెట్టలో జాగారపు చిన్న కుటుంబానికి రూ.3 లక్షల చెక్ అందజేస్తున్న నారా భువనేశ్వరి

విశాఖపట్నం/గాజువాక, జనవరి 5 (ఆంధ్రజ్యోతి):

"మీ నాయకుడు చంద్రబాబునాయుడు నన్ను పంపించారు. మీకు అన్నివిధాలా సహాయ, సహకారాలు అందుతాయి. పార్టీ అండగా ఉంటుంది. ఆందోళన చెందొద్దు, ధైర్యంగా ఉండండి"

- ఇదీ చంద్రబాబునాయుడు అరెస్టును జీర్ణించుకోలేక మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలకు నారా భువనేశ్వరి ఇచ్చిన భరోసా

'నిజం గెలవాలి' యాత్ర రెండో దశలో భాగంగా ఆమె శుక్రవారం నగరంలో పర్యటించారు. మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఆర్థిక సాయం అందజేశారు. తొలుత దక్షిణ నియోజకవర్గ పరిధిలోని వెంకటేశ్వర మెట్ట ప్రాంతానికి చెందిన జాగారపు చిన్న ఇంటికి వెళ్లారు. చిన్న భార్య గౌరిని, పిల్లలు దేవి, కిరణ్‌కుమార్, నందినిని భువనేశ్వరి పరామర్శించారు. ఈ సందర్భంగా గౌరి మాట్లాడుతూ తన భర్త నందమూరి తారక రామారావుపై అభిమానంతో పార్టీలో పనిచేసేవారన్నారు. చంద్రబాబు నాయుడు జైలు పాలుకావ డాన్ని తట్టుకోలేక మృతిచెందారని కన్నీటిపర్యంత మవ్వగా.. భువనేశ్వరి ఓదార్చారు. చదువు పూర్తిచేసిన తన కుమారుడికి ఉద్యోగం ఇవ్వాలని కోరగా ప్రభుత్వం వచ్చిన తరువాత ఆదుకుంటా మని హామీ ఇచ్చారు. చిన్న కుటుంబానికి భువనేశ్వరి రూ.మూడు లక్షల చెక్కు అందజేశారు. తరువాత జ్ఞానాపురం వెళ్లి మలిశెట్టి రమణ కుటుంబాన్ని పరామర్శించారు. రమణ చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబానికి రూ.మూడు లక్షల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా రమణ కుమారుడు, 41వ వార్డులో 17వ బూత్ అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ తన తండ్రి రమణ...ఎన్టీఆర్ అభిమానిగా ఉండేవారని, తరువాత పార్టీలో చేరి చివరి వరకూ పనిచేశారన్నారు. చంద్రబాబునాయుడు అరెస్టును తట్టుకోలేక పోయారని, బెయిల్ విషయంలో జాప్యం జరగడంతో మరింత మనస్తాపానికి గురై చనిపోయారన్నారు. భువనేశ్వరి స్పందిస్తూ అధైర్యపడొద్దని, అన్ని విధాలా పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆ తరువాత భువనేశ్వరి విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిధిలోని తాటిచెట్ల పాలెంలో పంచిరెడ్డి కనకారావు ఇంటికి వెళ్లి, ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. కనకారావు సతీమణి పార్వతి, కుమారుడు శ్యామ్, కుమార్తె ఉదయశ్రీలకు ధైర్యం చెబుతూ రూ.మూడు లక్షల చెక్ అందజేశారు. వృత్తి రీత్యా ఆటోడ్రైవర్ అయిన తన భర్త పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారని, చంద్రబాబును జైలులో పెట్టడాన్ని తట్టుకోలేక చనిపోయారని కనకారావు సతీమణి పార్వతి భోరుమన్నారు. ఇంజనీరింగ్ చేసిన తన కుమారుడికి ఉద్యోగం ఇప్పించాలని కోరగా టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత చూస్తామని హామీ ఇచ్చారు. మురళీ నగర్‌లో భోజనం చేసిన అనంతరం గాజువాక వెళ్లారు. బీసీ రోడ్డుకు చెందిన కోరుకొండ వెంకటరమణ, బానోజీ కాలనీ ప్రాంతానికి చెందిన ఉప్పలపాటి సరోజినీదేవి కుటుంబాలను పరామర్శించి రూ.3 లక్షల చొప్పున చెక్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం వస్తుందని, మీ కుటుంబాలకు మరింత చేయూతనిచ్చి తోడునీడగా ఉంటామని ధైర్యం చెప్పారు. అనంతరం షీలానగర్‌లో పమిడిముక్కల రాధాకృష్ణమూర్తి (టీడీపీ బాబాయి) కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన ... మిగతా 8వ పేజీలో



గాజువాక 65వ వార్డులో రాధాకృష్ణమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భువనేశ్వరి


రేపే 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు

- ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియంలో నిర్వహణ
- ఉదయం 10 గంటలకు ప్రారంభం



అనకాపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఏటా మాదిరిగా 'ఆంధ్రజ్యోతి ఏబీఎన్' యాజమాన్యం ఈ ఏడాది కూడా ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహిస్తోంది. 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్'...కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు...పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగుళూరు...రియల్ పార్టనర్ స్వర్ణసీమ సుకేతన' ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం అనకాపల్లిలో రాజా థియేటర్ పక్కనున్న ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియంలో జరగనున్నాయి. స్థానికంగా 'దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (డైట్- అటానమస్)' స్పాన్సర్ చేస్తోంది. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందించనున్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.6 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.4 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.3 వేలు ఇవ్వనున్నారు. ఇకపోతే, పోటీలో మహిళలు మాత్రమే పోటీల్లో పాల్గొనాలి. ముగ్గు, రంగులు, పువ్వులు వగైరా సామగ్రిని పోటీదారులే తెచ్చుకోవాలి. రెండు గంటల్లోగా ముగ్గు వేయాల్సి ఉంటుంది. చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి. పోటీల్లో పాల్గొనదలచినవారు మరిన్ని వివరాలకు ఈ 9985411045 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రతించాలి. ఉదయం 9 గంటలకల్లా ప్రాంగణానికి చేరుకోవాలి. కచ్చితంగా పది గంటలకు పోటీ ప్రారంభమవుతుంది.

అంగన్‌వాడీలు వినూత్న నిరసన



ఎస్.రాయవరంలో ప్రధాన రహదారిపై పొర్లు దండాలతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం 25వ రోజుకు చేరింది. గత ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయకుండా మొండిగా వ్యవహరిస్తున్నారని అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నా శిబిరాల్లో వివిధ రూపాల్లో నిరసన తెలిపారు. ఎస్.రాయవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రహదారిపై పొర్లుదండాలు పెడుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. బుచ్చెయ్యపేటలో అంగన్‌వాడీలు చెవుల్లో పూలు పెట్టుకుని, మోకాళ్లపై నిల్చుని నిరసన వ్యక్తం చేశారు.



రావికమతం మండలం కిత్తంపేట నుంచి వలసపోతున్న కూలీలు

వ్యవసాయ కూలీలు వలస

పొట్టచేతపట్టుకుని గోదావరి జిల్లాలకు పయనం

- గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించకపోవడమే కారణమంటున్న కూలీలు

రావికమతం, జనవరి 5:

గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభం కాకపోవడంతో వ్యవసాయ కూలీలు ఉపాధి కోసం వలసబాట పట్టారు. తట్టాబుట్టా సర్దుకుని గోదావరి జిల్లాల్లో రబీ వరినాట్లు పనులకు వెళుతున్నారు. వృద్ధులు, పిల్లలను ఇళ్ల వద్ద వదిలేసి, పొట్ట చేతపట్టుకుని పక్క జిల్లాలకు పోతున్నారు.

గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో పంటల సాగు తగ్గిపోయింది. ఆ ప్రభావం వ్యవసాయ కూలీల ఉపాధిపై పడింది. దీంతో గత ఏడాది నవంబరు నెలలో మండలంలో పలు గ్రామాల నుంచి వ్యవసాయ కూలీలు, ఉభయ గోదావరి జిల్లాల్లో వరి కోతల పనులకు వెళ్లారు. గత నెల మొదటి వారంనాటికి అక్కడ వరి కోతలు పూర్తికావడంతో తిరిగి సొంతూళ్లకు వచ్చారు. అదే సమయంలో ఇక్కడ వరి కోతలు మొదలు కావడంతో సుమారు మూడు వారాలపాటు కూలి పనులు లభించాయి. వరి నూర్పిళ్లకు యంత్రాలను వినియోగిస్తుండడంతో కూలీల అవసరం బాగా తగ్గిపోయింది. దీంతో వ్యవసాయ కూలీలకు పనులు లేనిపరిస్థితి నెలకొంది. ఇటువంటి సమయంలో ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభించి కూలీలకు ఉపాధి కల్పించాలి. కానీ గత నెలలో తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలతో చెరువుల్లో నీరు చేరిందని, అందువల్ల పూడిక తీత పనులు చేపట్టం సాధ్యం కాదంటూ ఉపాధి పనులు మొదలుపెట్టలేదు. దీంతో జడ్.బెన్నవరం, కిత్తంపేట, టి.అర్జాపురం, చిలకవానిపాలెం, తదితర గ్రామాలకు చెందిన వ్యవసాయ కూలీలు ఉపాధి కోసం ఉభయ గోదావరి జిల్లాల్లో రబీ వరినాట్లు పనులకు పది రోజుల నుంచి వలస పోతున్నారు. సంక్రాంతి ... మిగతా 8వ పేజీలో

సర్టిఫికెట్ల జారీలో జాప్యం

సచివాలయాల్లో స్టేషనరీ కొరత
సరఫరా చేయని ప్రభుత్వం

- కొన్నిచోట్ల సొంతసొమ్ముతో సమకూరుస్తున్న సర్పంచులు

చోడవరం, జనవరి 5:

గ్రామ/ వార్డు సచివాలయాల్లో అన్ని రకాల సర్టిఫికెట్లు మంజూరు చేస్తామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం.. ఇందుకు అవసరమైన స్టేషనరీని మాత్రం సమకూర్చడంలేదు. దీంతో సచివాలయాల్లో సర్టిఫికెట్ల జారీకి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.



గ్రామ సచివాలయం

రాష్ట్ర ప్రభుత్వం వివిధ రకాల సర్టిఫికెట్లను జారీ చేసే అధికారాన్ని తహసీల్దార్ కార్యాలయాలు, మీ-సేవా కేంద్రాల నుంచి తొలగించి సచివాలయాలకు అప్పగించిన విషయం తెలిసిందే. సర్టిఫికెట్ల జారీకి అవసరమైన స్టేషనరీని తొలుత అన్ని సచివాలయాలకు బాగానే సరఫరా చేశారు. అయితే ఇటీవల కాలంలో సర్టిఫికెట్లకు అవసరమైన పేపర్‌ను సరఫరా చేయకపోవడంతో చాలా సచివాలయాల్లో సర్టిఫికెట్ల జారీకి ఇబ్బందులు తలెత్తుతున్నట్టు సిబ్బందితోపాటు అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు వాపోతున్నారు. సచివాలయాలకు స్టేషనరీ వస్తే తప్ప సర్టిఫికెట్లు జారీచేయలేమని సచివాలయ సిబ్బంది చెబుతుండడంతో, సంబంధిత దరఖాస్తుదారులు స్థానిక ప్రజాప్రతినిధులను కలిసి తమ గోడు వెల్లబోసుకుంటున్నారు.

సచివాలయాలకు సరఫరా చేసిన స్టేషనరీలో సింహభాగం రెండు నెలల క్రితం వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లో ఆరు రకాల సర్టిఫికెట్ల జారీ కోసం నిర్వహించిన శిబిరాల సందర్భంగా భారీగా ఉపయోగించేశారు. దీనితో చాలా సచివాలయాల్లో స్టేషనరీ నిండుకుంది. కొన్ని పంచాయతీల సర్పంచులు సొంత సొమ్ముతో స్టేషనరీ కొనుగోలు చేసి సచివాలయాలకు అందజేయగా, ఇప్పటికే నిధులు లేక విలవిల్లాడుతున్న పంచాయతీల సర్పంచులు ఇలాంటి ఖర్చుల విషయంలో చేతులెత్తేశారు. దీంతో అత్యధిక సచివాలయాల్లో సర్టిఫికెట్లు జారీ చేయడంలేదని తెలిసింది. చోడవరం మండలంలో లక్కవరంతోపాటు మరికొన్ని సచివాలయాల్లో సర్టిఫికెట్ల జారీకి పేపర్ కొరత ఉన్నట్టు సమాచారం. అయితే సచివాలయాల సిబ్బంది ఈ విషయాన్ని బయటకు చెప్పకుండా, సర్టిఫికెట్ల జారీకి సమయం పడుతుందంటూ దాటవేస్తున్నారు. కాగా చోడవవరం మండలంలోని సచివాలయాల్లో స్టేషనరీ సమస్యపై ఈవోపీఆర్‌డీ బి.చైతన్యను వివరణ కోరగా, కొన్ని సచివాలయాలకు స్టేషనరీ పేపర్ అందుబాటులో ఉంచామని తెలిపారు.



'రాంకీ' ఫార్మా కమర్షియల్ హబ్‌ను సందర్శించిన పంజాబ్ సీఎం

- పారిశ్రామిక అభివృద్ధికి సహకరించాల్సిందిగా విజ్ఞప్తి

రాంకీ ఫార్మా హబ్‌లో కంపెనీ ప్రతినిధులతో సమావేశమైన పంజాబ్ సీఎం భగవంత్‌మన్

- 7లో



నిలిచిపోయిన వాహనాలు

చోడవరం-గోవాడ మధ్య స్తంభించిన ట్రాఫిక్

శారదా నది వంతెనపై జారిపడిన చెరకు మోపులు

- రెండు గంటలపాటు నిలిచిపోయిన వాహనాల రాకపోకలు
- తీవ్ర ఇబ్బందులు పడిన ప్రయాణికులు



గోవాడ వంతెనపై పడిపోయిన చెరకు గడలు

చోడవరం, జనవరి 5: గోవాడ- చోడవరం మధ్య శుక్రవారం సాయంత్రం భారీగా ట్రాఫిక్ స్తంభించింది. గోవాడ షుగర్స్‌లో చెరకు క్రషింగ్ ప్రారంభం కావడంతో ఫ్యాక్టరీకి చెరకు తీసుకువెళుతున్న ఓ వాహనం శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో శారదా నది వంతెన మధ్యలోకి వచ్చేసరికి తాళ్లు ఊడిపోయి చెరకు మోపులు రోడ్డుపై పడ్డాయి. దీంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకుని ఇద్దరు ఎస్ఐలు, పలువురు పోలీసులు శారదా నది వంతెన వద్దకు వెళ్లి చెరకు మోపులను పక్కకు తీయించారు. సుమారు ఆరు గంటల సమయంలో ట్రాఫిక్‌ను పునరుద్ధరిం చారు. కాగా దాదాపు రెండు గంటలపాటు వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

క్రైం... crime news

34 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

రోలుగుంట, జనవరి 5: మండలంలోని బీబీపట్నం శివారు ఊడివారి పాకల వద్ద 34 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. ఏజెన్సీ నుంచి గంజాయిని తీసుకువచ్చి బీబీపట్నం ఊడివారి పాకల వద్ద దాచిపెట్టినట్టు బుధవారం రాత్రి ముందస్తు సమాచారం అందిందన్నారు. దీనిపై వెంటనే సిబ్బందితో దాడిచేసి గంజాయితో పాటు ఇద్దరు వ్యక్తులకు అదుపులోకి తీసుకున్నామని, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ ఘటనలో రత్నంపేట, బీబీ పట్నం గ్రామాలకు చెందిన ముగ్గురు పరారీలో ఉన్నారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

120 కిలోల గంజాయి స్వాధీనం

పద్మనాభం (విశాఖపట్నం), జనవరి 5: ఒడిశాలోని చిత్రకొండ నుంచి విశాఖకు తరలిస్తున్న 120 కిలో గంజాయిని పట్టుకున్నట్టు సిటీ టాస్క్‌ఫోర్సు ఏసీపీ త్రినాథరావు చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకా రం.. నగర పోలీసు కమిషనరు రవిశంకర్, స్పెషల్ బ్రాంచ్ అడిషనల్ కమిషనరు నాగేంద్రుడు ఆదే శాల మేరకు శుక్రవారం చిన్నాపురం సమీపంలోని లేఅవుట్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేప ట్టగా కారులో తరలిస్తున్న 120 కిలోల గంజాయి లభించింది. దీని విలువ రూ. 6 లక్షల ఉంటుంది. గంజాయితో పాటు రవాణాకు ఉపయోగించిన కారు, బైకు, ఆరు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కె. గోపాల్, పి. రవిబాబు (అరకు), ఎస్ బోరా (కోరాపుట్), పి. వరప్రసాద్ (హుకుంపేట), జి.రామకృష్ణ (డుంబ్రిగుడ)ను అరెస్టు చేశారు. సీఐ సన్యాసినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూతన సాంకేతిక పరిజ్ఞానంతో బోధన చేస్తే సత్ఫలితాలు

- కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్
- ఎలమంచిలిలో జోన్ 1 కళాశాలల సమీక్ష సమావేశం



రాష్ట్ర కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్‌ను సత్కరిస్తున్న కళాశాల అధ్యాపకులు

ఎలమంచిలి, జనవరి 5: కళాశాలల్లో కొత్త కోర్సులను ప్రవేశపెడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి బోధన చేసినప్పుడు సత్ఫలితాలు సాధించవచ్చునని రాష్ట్ర కళాశాల విద్యా కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ అన్నారు. శుక్రవారం ఎలమంచిలిలోని గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జోన్-1 కళాశాలల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎలమంచిలి డిగ్రీ కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు దాతల సహకారాన్ని తీసుకొని నాక్ ఏ గ్రేడును సాధించడమే కాకుండా స్వతంత్ర ప్రతిపత్తి పొందడం గొప్ప విషయమన్నారు. ఆదర్శవంతంగా నిలిచిన కళాశాల అధ్యాపక బృందాన్ని ఆయన అభినందించారు. సమిష్టిగా ఉంటూ కళాశాలను తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. అనంతరం కళాశాలలో మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు ఉపయోగపడేలా ఉన్న కళాశాల పరిసరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే విభాగాలు, జిమ్ తదితర విభాగాలను బృంద సభ్యులంతా పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులంతా పోలా భాస్కర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశానికి ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాలకు చెందిన 40 ప్రభుత్వ, 3 ఎయిడెడ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, కళాశాలల అంతర్గత నైపుణ్యాల మదింపు సంస్థల అధికారులు ఏజీఓ తులసి మస్తానమ్మ, జోన్ వన్ ఆర్‌జేడీ శోభా హాజరయ్యారు.

భువనేశ్వరిని కలిసిన రత్నాకర్ దంపతులు



భువనేశ్వరితో మాట్లాడుతున్న రత్నాకర్ దంపతులు

అనకాపల్లి టౌన్, జనవరి 5 : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరిని శుక్రవారం గాజువాకలో తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. చంద్రబాబునాయుడు అరెస్టు అయినప్పుడు మనోవేదనతో మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలను పరామర్శించేందుకు వచ్చిన భువనేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెతో పలు అంశాలపై చర్చించినట్టు ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ద్వైవార్షిక నగదు మంజూరులో 1856 మందికి లబ్ధి: కలెక్టర్

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 5: జిల్లాలో ద్వైవార్షిక నగదు మంజూరు చేసినట్టు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 1856 మందికి రూ.2.64 కోట్లు చెల్లిస్తున్నట్టు చెప్పారు. ఆగస్టు నుంచి డిసెంబరు నెలల మధ్య రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల పథకాల్లో అర్హత ఉండి నిర్ణీత సమయంలో దరఖాస్తు చేసుకోలేకపోవడం, బ్యాంక్ ఖాతాల వివరాలు సరిగా లేనివారికి ద్వైవార్షిక నగదులో చెల్లిస్తున్నట్టు తెలిపారు. శుక్రవారం సీఎం జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లిలో ద్వైవార్షిక నగదు మంజూరు చేస్తూ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో శంకరంలోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రవి పట్టన్‌శెట్టితో పాటు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగన్ అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు పెరిగాయి

- మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పెంటారావు
- ప్రభుత్వం వ్యతిరేక చర్యలను నిరసిస్తూ త్వరలో భవిష్యత్ కార్యాచరణ



సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పెంటారావు

నర్సీపట్నం, జనవరి 5 : రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు, దౌర్జన్యాలు పెరిగాయని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పాల్తేరు పెంటారావు ఆరోపించారు. శుక్రవారం ఇక్కడ జరిగిన దళిత సంఘాల జిల్లా నాయకుల సమావేశంలో మాట్లాడారు. జాతీయ కారాగార గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 41.16 శాతం దాడులు, దౌర్జన్యాలు, మహిళలపై అత్యాచారాలు పెరిగాయని 2023 నివేదిక వెల్లడించిందంటే దళితుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చునని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 28 రకాల సంక్షేమ పథకాలను రద్దు చేసిందని విమర్శించారు. దళితుల భూములు ఆక్రమణకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దళిత వ్యతిరేక చర్యలను ఎత్తిచూపుతూ త్వరలో భవిష్యత్ కార్యాచరణ చేపడతామన్నారు. ఈ సమావేశంలో నాయకులు నేత నాగేశ్వరరావు, గాతాడ సహదేవుడు, యర్రంశెట్టి పాపారావు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా అనకాపల్లి

- కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, పక్కన ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి, జనవరి 5 (అనకాపల్లి): మాదకద్రవ్యాల రహిత జిల్లాగా చేయాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్పీ కేవీ మురళీకృష్ణతో కలిసి డిస్ట్రిక్ట్ లెవెల్ నార్కో కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా సంబంధిత శాఖల సమన్వయంతో డబ్బు, మద్యం, ఉచిత కానుకలు, మాదక ద్రవ్యాల కట్టడికి కృషిచేయాలని సూచించారు. ఎన్‌సీఓఆర్‌డీ కమిటీ ఆధ్వర్యంలో అన్ని శాఖల సమన్వయంతో పనిచేసి మాదక ద్రవ్యాల నివారణకు పోలీసు శాఖతో కలిసి పనిచేయాలన్నారు. జిల్లా ఎస్పీ కేవీ.మురళీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర శాఖల సమన్వయంతో పని చేసి మాదకద్రవ్యాల సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా అడ్డుకట్ట వేయాలన్నారు. రానున్న ఎన్నికలు నేపథ్యంలో మరింత సమర్థవంతంగా పని చేసి గంజాయి రవాణాను అన్ని శాఖల సహకారంతో అడ్డుకట్ట వేస్తామన్నారు. తరచూ గంజాయి రవాణా నేరాలకు పాల్పడుతున్న నిందితులపై కఠిన చర్యల్లో భాగంగా 27 మందిని గుర్తించామన్నారు. వీరిలో ఏడుగురిపై పీడీ యాక్ట్ నమోదు చేశామన్నారు. నేరాలకు పాల్పడుతున్న నిందితులు ఉంటున్న 63 గ్రామాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశామని, 241 మందిపై హిస్టరీ షీట్‌లను తెరవడం జరిగిందన్నారు. సమావేశంలో జేసీ ఎం.జాహ్నవి, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఆర్‌ఎస్‌వీ.ప్రసాద్, ఏఎస్పీలె బి.విజయభాస్కర్, అధిరాజ్‌సింగ్ రాణా, కోస్టుగార్డ్ కమాండెంట్ గోవింద్ సరోన్, నర్సీపట్నం ఆర్డీఓ జయరాం, డీఎంహెచ్‌ఓ హేమంత్, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ వి.సుబ్బరాజు, డీఆర్‌ఓ దయానిధి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విలేకరుల ఇళ్ల స్థలాల ప్రక్రియ వేగవంతం చేయాలి

అనకాపల్లి రూరల్: జిల్లాలో అర్హులైన విలేకరులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ చాంబర్‌లో జరిగిన జర్నలిస్టుల హౌసింగ్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను అనుసరించి విలేకరుల ఇళ్ల స్థలాలకు ప్రభుత్వ భూమిని గుర్తించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ పత్రికల విలేకరులు పాల్గొన్నారు.

'రాంకీ' ఫార్మా కమర్షియల్ హబ్‌ను సందర్శించిన పంజాబ్ సీఎం

- పారిశ్రామిక అభివృద్ధికి సహకరించాల్సిందిగా విజ్ఞప్తి

పరవాడ, జనవరి 5: తమ రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని 'రాంకీ ఫార్మా' ప్రతినిధులను పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మన్ కోరారు. శుక్రవారం ఆయన అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో గల రాంకీ ఫార్మాసిటీ కమర్షియల్ హబ్‌ను సందర్శించారు. అనంతరం రాంకీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. తమ రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పేందుకే అనువైన ప్రదేశాలు ఉన్నాయని, పారిశ్రామికవేత్తలు తరలివచ్చేలా చూడాలన్నారు. ఇందుకోసం తమ రాష్ట్ర ముఖ్య కార్యదర్శిని పంపిస్తామని, ఆయనతో అన్ని విషయాలు చర్చించాలని కోరారు. ఈ సందర్భంగా ఫార్మా సిటీ ఎండీ లాల్‌కృష్ణ..రాంకీ ద్వారా చేపడుతున్న కార్యకలాపాల గురించి వివరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కేవీ మురళీకృష్ణ, జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు, రాంకీ ప్రతినిధులు రాఘవరెడ్డి, యర్రయ్య తదితరులు పాల్గొన్నారు. తొలుత పంజాబ్ సీఎంకు స్థానిక శాసనసభ్యుడు అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఘన స్వాగతం పలికారు.

పంచాయతీ కార్మికుల వేతన బకాయిలను చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 5: పంచాయతీ కార్మికుల వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట పంచాయతీ కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగ పూట కూడా పంచాయతీ కార్మికులను పస్తులు పెట్టడం వైసీపీ ప్రభుత్వానికి పరిపాటిగా మారిందన్నారు. కొన్ని పంచాయతీల్లో మూడు నుంచి 13 నెలలుగా గ్రీన్ అంబాసిడర్‌లకు వేతనాలు ప్రభుత్వం చెల్లించలేదన్నారు. తక్షణమే ప్రభుత్వం పంచాయతీ కార్మికుల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఆంజనేయ వాహనంపై ఆపద్బాంధవుడు



స్వామివారి తిరువీధి సేవ

నక్కపల్లి, జనవరి 5: ఉపమాక క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉపమాక వెంకన్న తిరువీధి సేవ ఘనంగా జరిగింది. ముందుగా కొండపైన, కింద ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, ధూప, దీప, నైవేద్య నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి, బాలభోగ, రాజభోగ నివేదన చేశారు. అనంతరం ఆంజనేయ వాహనంపై స్వామివారిని, పల్లకీలో గోదాదేవి అమ్మవారిని అలంకరించి మాడవీధుల్లో ఊరేగించారు. తదుపరి గోదాదేవి అమ్మవారి సన్నిధి వద్ద తిరుప్పావై పాశుర విన్నపం చేశారు.

గిరి ప్రదక్షిణోత్సవానికి ఏర్పాట్లు చేయండి

నక్కపల్లి, జనవరి 5: కనుమ పండుగ రోజున ఉపమాకలో జరగనున్న గరుడాద్రి పర్వతం చుట్టూ జరిగే స్వామివారి గిరి ప్రదక్షిణోత్సవానికి ఏర్పాట్లు సకాలంలో చేపట్టాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ కోరారు. శుక్రవారం ఉపమాక ఆలయానికి వెళ్లి ఆలయ అధికారులతో ఆయన మాట్లాడారు. గిరి ప్రదక్షిణోత్సవానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకో వాలని కోరారు. కొండ చుట్టూ ఉన్న మార్గంలో తుప్పలు తొలగించాలన్నారు. ఆయన వెంట వైసీపీ నాయకులు వున్నారు.

'వాల్మీకులు అంటే వైసీపీకి చిన్నచూపు'

విశాఖపట్నం, జనవరి 5: ఏజెన్సీలో ఆదివాసీ వాల్మీకి కులస్తులకు రాజకీయంగా తగిన ప్రాధాన్యత ఇవ్వకపోతే వైసీపీకి వచ్చే ఎన్నికల్లో భంగపాటు తప్పదని ఆదివాసీ వాల్మీకి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రామ్మూర్తి హెచ్చరించారు. శుక్రవారం ఆయన ఎంవీపీ కాలనీలోని గిరిజన్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. వాల్మీకిలు అంటే వైసీపీకి చిన్నచూపు ఉందన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ సమన్వయకర్తల నియామకం తమను తీవ్ర నిరాశకు గురిచేసిందని చెప్పారు. ఏజెన్సీలో ఉన్న బలమైన సామాజిక వర్గాలు భగత, వాల్మీకి, కొండదొరలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన వారు చింతపల్లి నుంచి దేవూరి కొండలరావు, కోరాబు వెంకటరత్నం, పసుపులేటి బాలరాజు గెలుపొందారని, అరకు నుంచి దుక్కు, సర్వేశ్వరరావు, శెట్టి ఫాల్గుణ ఎన్నికయ్యారని తెలిపారు. ప్రస్తుతం ఎస్టీల ముసుగులో కొందరు బినామీ ప్రజాప్రతినిధులుగా చలామణి అవుతున్నారని ఆరోపించారు. ఆయనతో పాటు ఆ సంఘం నాయకులు రామారావు, సత్యారావు, రామలింగం, పాపారావు ఉన్నారు.

సింహాద్రి మొదటి యూనిట్ ఉత్పత్తి పునరుద్ధరణ

పరవాడ, జనవరి 5: సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మొదటి యూనిట్‌లో ఉత్పత్తిని శుక్రవారం రాత్రి అధికారులు పునరుద్ధరించారు. వార్షిక నిర్వహణ పనుల నిమిత్తం గతేడాది నవంబరులో ఈయూనిట్‌ను షెట్‌డౌన్ చేసిన సంగతి తెలిసిందే. నిర్వహణ పనులు పూర్తి చేసి శుక్రవారం యూనిట్‌లో ఉత్పత్తిని ప్రారంభించారు. శనివారం ఉదయానికి యూనిట్‌లో పూర్తి స్థాయి ఉత్పత్తి జరుగుతుందని అధికారులు తెలిపారు. మిగతా రెండు, మూడు, నాలుగు యూనిట్‌ల్లో ఉత్పత్తి యథావిధిగా కొనసాగుతుందన్నారు.

మద్యం మత్తులో కేజీహెచ్‌లో స్వీపర్ అరాచకం

విశాఖపట్నం, జనవరి 5: కేజీహెచ్‌లో స్వీపర్ మద్యం మత్తులో రోగి వెంట వచ్చిన సహాయకురాలి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆస్పత్రిలోని భవనగర్ వార్డులో చికిత్స పొందుతున్న రోగికి సహాయంగా కుటుంబ సభ్యురాలు వచ్చారు. గురువారం రాత్రి నిద్రిస్తున్న ఆమెను ఆస్పత్రి స్వీపర్ ధనాల వాసు మద్యం మత్తులో వెనుక నుంచి గట్టిగా కొరికాడు. దీంతో ఆమె లేచి కేకలు వేసింది. శరీరంపై పంటి గాట్లు పడడంతో సిబ్బంది వెంటనే చికిత్స అందించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.

దువ్వాడ మీదుగా సంక్రాంతి ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, జనవరి 5: సంక్రాంతి ప్రయాణికుల సౌకర్యార్థం వయా దువ్వాడ మీదుగా హైదరాబాద్, సికింద్రాబాద్, బ్రహ్మపూర్‌కు ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఏకే.త్రిపాఠి తెలిపారు.

హైదరాబాద్-బ్రహ్మపూర్-హైదరాబాద్

07027 నంబరు గల రైలు ఈనెల 13న రాత్రి 10.40 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 10.25 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 3.15 గంటలకు బ్రహ్మపూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07028 నంబరు గల రైలు ఈనెల 14న సాయంత్రం 6.00 గంటలకు బ్రహ్మపూర్‌లో బయలుదేరి రాత్రి 11.25 గంటలకు దువ్వాడ, మర్నాడు మధ్యాహ్నం 11.30 గంటలకు హైదరాబాద్ చేరుతుంది.

సికింద్రాబాద్-బ్రహ్మపూర్-సికింద్రాబాద్

07025 నంబరు గల రైలు ఈనెల 12, 19తేదీల్లో రాత్రి 7.45 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 5.45 గంటలకు దువ్వాడ, 11.15 గంటలకు బ్రహ్మపూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07026 నంబరు గల రైలు మధ్యాహ్నం 12.30 గంటలకు బ్రహ్మపూర్‌లో బ యలుదేరి సాయంత్రం 5.10 గంటలకు దువ్వాడ, మర్నాడు ఉదయం 6.30 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది.

కిరండోల్ రైళ్లు జగదల్‌పూర్ వరకే...

కేకే లైనులోని దంతెవాడ, కామలూర్ స్టేషన్ల మధ్య భద్రతా నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యంలో విశాఖ -కిరండోల్ మధ్య రాకపోకలు సాగించే రైళ్లను విశాఖ, జగదల్‌పూర్ మధ్య నడిపించనున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే.త్రిపాఠి తెలిపారు. 18514 నంబరు గల నైట్ ఎక్స్‌ప్రెస్, 08551 నంబరు గల డే ఎక్స్‌ప్రెస్ ఈనెల 9వతేదీ విశాఖ నుంచి జగదల్‌పూర్ వరకు...తిరుగు ప్రయాణంలో 18513 నంబరు గల నైట్ ఎక్స్‌ప్రెస్, 08552 నంబరు గల డే ఎక్స్‌ప్రెస్ ఈ నెల 10న జగదల్‌పూర్‌లో బయలుదేరి విశాఖ చేరనున్నట్టు పేర్కొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	70.00
లైవ్ ధర	90.00
విత్ స్కిన్	150.00
స్కిన్ లెస్	160.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి అమర్‌నాథ్



పింఛన్లు లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్, జనవరి 5 : పట్టణంలో నూతనంగా మంజూరు చేసిన 151 పింఛన్లను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక జీవీఎంసీ జోనల్ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులు, పేదలు ఆర్థిక ఇబ్బందులు పడకూడదని ముఖ్యమంత్రి క్రమం తప్పకుండా పింఛన్లు మంజూరు చేస్తున్నారన్నారు. వైసీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, కార్పొరేటర్ మందపాటి సునీత, జోనల్ కమిషనర్ ఎస్. వెంకటరమణ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.35 లక్షలు పరిహారం

రాంబిల్లి, జనవరి 5: ఎస్ఈజెడ్‌లోని రసూల్ డెక్కర్ పరిశ్రమలో ప్రమాదానికి గురై మృతి చెందిన మధ్యప్రదేశ్‌కు చెందిన షిఫ్ట్ ఇన్‌చార్జి మనీష్ ప్రజాపతి కుటుంబానికి కంపెనీ యాజమాన్యం రూ.35లక్షలు నష్టపరిహారం ఇచ్చేందుకు అంగీకరించిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, జి.దేముడునాయుడు తెలిపారు. శుక్రవారం కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిపిన అనంతరం వీరు మాట్లాడుతూ మృతుడు కుటుంబానికి రూ.35లక్షలు నష్టపరిహారంతోపాటు, మృతుడి భార్య, కుమారునికి పెన్షన్ ఇచ్చేందుకు కంపెనీ యాజమాన్యం అంగీకరించిందన్నారు. ఈ మేరకు అంగీకార పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందజేసిందని సీఐటీయూ నేతలు రాము, దేమునాయుడు తెలిపారు.

కానిస్టేబుళ్ల అభ్యర్థులకు శిక్షణ కోసం రాత పరీక్ష

అనకాపల్లి టౌన్, జనవరి 5 : రాంకీ ఫౌండేషన్, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక హిమశేఖర్ డిగ్రీ కళాశాలలో ఆర్మ్‌డ్ ఫోర్స్‌లో పోలీస్ కానిస్టేబుళ్లకు శిక్షణ కోసం ప్రవేశపరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 90 మంది విద్యార్థులు హాజరయ్యారని నిర్వాహకులు వై. మద్దిలేటి రెడ్డి, కె.లక్ష్మీనారాయణ, కె.రామ్మోహనరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు గుంటూరు లేదా హైద్రాబాద్‌ల్లో రెండు నుంచి మూడు నెలలు పాటు ఉచిత వసతి, భోజన సదుపాయాలతో కోచింగ్, స్టడీ మెటీరియల్ అందజేస్తామని రాంకీ ఫౌండేషన్ ప్రతినిధి కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ పరీక్షకు సహకారమందించిన కళాశాల కరస్పాండెంట్ కె.జనార్దన్, ప్రిన్సిపాల్ శ్రీధర్, కె.రామ్మోహన్, డైరెక్టర్ పరమేష్‌కి రాంకీ ఫౌండేషన్‌ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

కొనసాగుతున్న పారిశుధ్య కార్మికుల సమ్మె

అనకాపల్లి టౌన్, జనవరి 5 : పట్టణంలో పారిశుధ్య కార్మికుల సమ్మె శుక్రవారం కూడా కొనసాగింది. తమ సమస్యలను పరిష్కరించాలని అనకాపల్లి జీవీఎంసీ జోన్ పరిధిలోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు 11 రోజులుగా సమ్మె చేస్తున్నారు. శుక్రవారం జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఎదుట కార్మికులు ప్రభుత్వానికి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా సమాచారం ఇవ్వడానికి గోప్యత ఎందుకు?

» జోనల్ అధికారులను ప్రశ్నించిన సమాచార కమిషనర్

అనకాపల్లి టౌన్, జనవరి 5 : స్వచ్ఛందంగా వెల్లడించాల్సిన సమాచారాన్ని గోప్యంగా ఉంచడం తగదని రాష్ట్ర సమాచార కమిషనర్ ఐలాపురం రాజా జీవీఎంసీ జోనల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచార హక్కుచట్టం ఉద్యమకర్త కాండ్రేగుల వెంకటరమణ తెలిపారు. టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, ఇంజినీరింగ్, పరిపాలన కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని కోరుతూ 2022 నవంబరు ఒకటో తేదీన వేర్వేరుగా ఆర్‌టీఐ చట్టం ద్వారా ఐదు దరఖాస్తులకు అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో సమాచారం ఇవ్వలేదన్నారు. తిరిగి అప్పీలు చేసినా జోనల్ అధికారులు స్పందించలేదన్నారు. దీంతో రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆశ్రయించామన్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం కమిషనర్ రాజా వర్చువల్ విధానంలో విచారణ చేశారన్నారు. జోన్ పరిధిలోని అన్ని అంశాలకు సంబంధించిన సమాచారాన్ని దరఖాస్తుదారునికి అందజేయాలని, రికార్డుల తనిఖీకి అనుమతి కల్పించాలని కమిషనర్ రాజా ఆదేశించారని వెంకటరమణ తెలిపారు. విచారణలో జోనల్ కమిషనర్ ఎస్.వెంకటరమణ, ఏసీపీ డి.ఝాన్సీ లక్ష్మి, రెవెన్యూ అధికారి సురేష్, తాను పాల్గొన్నానన్నారు.

జగన్ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు

» టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీనాయుడు

కోటవురట్ల, జనవరి 5: ప్రజల వ్యతిరేకతను చూసి సీఎం జగన్మోహన్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి లాలం కాశీనాయుడు అన్నారు. శుక్రవారం జల్లూరులో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేలు వైసీపీ ప్రభుత్వంపై ప్రజలకు వ్యతిరేకత దృష్టిలో పెట్టుకుని రాజీనామాలు చేస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం పదేళ్ల వెనక్కి వెళ్లిపోయిందన్నారు. సైకో పాలన విముక్తి కోసం ప్రజలు ఎదురుచేస్తున్నారన్నారు. సమావేశంలో జీరెడ్డి నానిబాబు, మాజీ సర్పంచ్ సీహెచ్ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగింపు

సబ్బవరం, జనవరి 5 : మండల కేంద్రంలో సర్వే నంబరు 260లో ఉన్న ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను ఆర్ఐ వీరయ్య, వీఆర్వో రుక్మిణి శుక్రవారం తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బి.సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమి ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టినా.. క్రయ విక్రయాలు జరిపిన ల్యాండ్ గ్రేబింగ్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఇటీవల ఎవరికీ ఇళ్ల పట్టాలు జారీ చేయలేదని, ప్రభుత్వ భూములను కొని ఎవరూ మోసపోవద్దని తహసీల్దార్ హెచ్చరించారు.

చలో ఎస్పీడీ ముట్టడిని భగ్నం చేసిన పోలీసులు

అనకాపల్లి రూరల్, జనవరి 5 : సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల తలపెట్టిన చలో ఎస్పీడీ కార్యాలయ ముట్టడిని శుక్రవారం పోలీసులు భగ్నం చేశారు. ముట్టడి సమాచారాన్ని తెలుసుకున్న పోలీసులు శిక్ష ఉద్యోగుల సంఘ నాయకుల ఇంటికి వెళ్లి ముందస్తుగా గృహ నిర్బంధం చేశారు. అనంతరం వారిని సంబంధిత పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. అనంతరం సాయంత్రం వ్యక్తిగత పూచీకత్తులపై విడిచిపెట్టారు.

తైక్వాండో పోటీల్లో డైట్ విద్యార్థినికి బంగారు పతకం

అనకాపల్లి టౌన్, జనవరి 5 : విజయవాడలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో స్థానిక డైట్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని యు. జయశ్రీ బంగారు పతకం సాధించిందని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బీసీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ పోటీల్లో సీనియర్స్ 57 కిలోల విభాగంలో జయశ్రీ ఈ పతకం సాధించిందన్నారు. విద్యార్థిని జయశ్రీని కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ ఆర్. వైకుంఠరావు, వివిధ విభాగాధిపతులు కె. పార్వతి, కృష్ణనాగు, శేషగిరిరావు అభినందించారు.

పీఏసీఎస్ పెట్రోల్ బంక్ ప్రారంభం

పాయకరావుపేట రూరల్, జనవరి 5 : స్థానిక పీఏసీఎస్ మంగవరంలో ఏర్పాటుచేసిన హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్‌ని శుక్రవారం ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, జడ్పీటీసీ సభ్యుడు సూరిబాబు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ రాజేష్‌ఖన్నా, హెచ్‌పీసీఎల్ ప్రతినిధి యాస్‌మిత్రా, డీసీసీబీ మేనేజరు లీలాశివజ్యోతి పాల్గొన్నారు.

టెన్త్ మోడల్ పేపర్లు విడుదల

అచ్యుతాపురం రూరల్, జనవరి 5 : మండల కేంద్రంలోని హైస్కూల్‌లో శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి మోడల్ పేపర్లను యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు పద్మావతి విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రటరీ ఎం.రమణ, ఎస్ఎఫ్ఐ నాయకులు, 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మూడో రోజుకు చేరిన ఎలమంచిలి మునిసిపల్ కార్మికుల సమ్మె

ఎలమంచిలి, జనవరి 5: ఎలమంచిలి మునిసిపల్ పారిశుధ్య కార్మికుల సమ్మె శుక్రవారం మూడో రోజుకు చేరింది. మునిసిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నిరసన శిబిరాన్ని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వైఎన్.భద్రం సందర్శించి, కార్మికులకు మద్దతు పలికారు. కనీస వేతనంతో పాటు కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



నిరసన శిబిరం వద్ద మాట్లాడుతున్న వైఎన్.భద్రం

క్షీణిస్తున్న పారిశుధ్యం

కార్మికుల సమ్మె కారణంగా పట్టణంలో పారిశుధ్యం క్షీణిస్తున్నది. రహదారులు, వీధుల్లోని నివాస ప్రాంతాలన్నీ చెత్త చెదారం పేరుకుపోయి దుర్గంధం వస్తోంది. పట్టణ ప్రధాన రహదారి మినహా మిగిలిన వీధులన్నీ చెత్త చెదారం పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్నాయి. మునిసిపల్ వార్డుల్లో ఇంటింట చెత్త సేకరణ నిలిచిపోయింది. కొన్ని వీధుల్లో చెత్త డంపర్ బిన్‌లు చెత్తతో నిండిపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్నాయి. మునిసిపాలిటీలో మొత్తం 92 మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు. వీరిలో 78 మంది సిబ్బంది సమ్మెలోకి వెళ్లారు. మిగిలిన వారంతా ప్రధాన రోడ్డు, మార్కెట్ వీధుల్లో చెత్తను తొలగించే పనిలో ఉంటున్నారు. ఇదే పరిస్థితి మరికొన్ని రోజులు కొనసాగితే ప్రజారోగ్యం దెబ్బతింటున్నదని ఎదురవుతుందని అంటున్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

అనకాపల్లి టౌన్, జనవరి 5 : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు 25వ రోజు శుక్రవారం సమ్మెను కొనసాగించారు. అనకాపల్లి పరిసర ప్రాంతాల నుంచి అంగన్‌వాడీలు నెహ్రూచౌక్ సమీపాన బస్టాప్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పరవాడలో.. తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించకపోవడం దారుణమని అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు సీహెచ్. దేవి, రమణి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపడుతున్న ఆందోళన శుక్రవారం నాటికి 25వ రోజుకి చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలంతా కలిసి ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు జానకి, ఉమా, వెంకటలక్ష్మి, అమ్మాజీ, శంకరమ్మ, కుమారి పాల్గొన్నారు.

రాంబిల్లిలో.. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుండా మొండిగా వ్యవహరించడం ప్రభుత్వానికి తగదు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేస్తున్న ఆందోళన శుక్రవారానికి 25వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా దేముడునాయుడు అంగన్‌వాడీలకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు బి.మంగ, సుజాత, నూకరత్నం, శేషారత్నం, సావిత్రి పాల్గొన్నారు.

సబ్బవరంలో.. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె శుక్రవారం 25వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా యూనియన్ నాయకురాలు రమణమ్మ మాట్లాడుతూ.. ప్రభుత్వం మొండివైఖరి వీడి డిమాండ్లు పరిష్కరించాలని కోరారు.

నక్కపల్లిలో.. పిల్లలకు, బాలింతలు, గర్భిణులకు సకాలంలో ఆరోగ్య సలహాలిస్తూ.. పౌష్టికాహారాన్ని అందజేస్తున్న చిరు ఉద్యోగులైన అంగన్‌వాడీలపై సర్కారు చిన్న చూపు చూస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీల ధర్నా శిబిరాన్ని టీడీపీ నాయకులు సందర్శించి, వారికి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధి ఎం.దుర్గారాణి తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో.. తమ సమస్యలు పరిష్కారం కోరుతూ సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు శుక్రవారం కోలాటం ఆడుతూ ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు 25వ రోజు శుక్రవారం కోలాటం ఆడుతూ, పొర్లు దండాలు పెడుతూ ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



పాయకరావుపేటలో కోలాటం ఆడుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

అలరించిన అంగన్‌వాడీల స్కిట్

మునగపాక, జనవరి 5: తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ అధికార పార్టీ ఎమ్మెల్యేను నిలదీస్తున్నట్టు అంగన్‌వాడీలు మునగపాక మెయిన్‌రోడ్‌పై చేసిన స్కిట్ అందరినీ అలరించింది. ఎమ్మెల్యే గారూ.. ఎన్నికల ముందు మాకిచ్చిన హామీల సంగతేంటి? 20 రోజులుగా నడిరోడ్‌పై చేస్తున్న ఆందోళనల పట్ల ఎందుకు స్పందించలేదు? మా అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు బలవంతంగా బద్దలు కొట్టి ఆక్రమించుకోవడం ఎంత వరకూ సమంజసం ? సమ్మె విరమించుకోకపోతే తీవ్ర పరిణామాలని హెచ్చరికలా? వీటికి బదులిచ్చి కదలండి అంటూ ఎమ్మెల్యే పాత్రధారిని చుట్టుముట్టి చేసిన స్కిట్ అందరినీ ఆకట్టుకుంది. ఓట్లు వేస్తే వేయండి.. లేకపోతే పోండి.. మీ డిమాండ్లకు మాత్రం తలొగ్గేదిలేదంటూ ఎమ్మెల్యే పాత్రధారి అనడంతో అంగన్‌వాడీలు నినాదాలు చేసి రక్తి కట్టించారు. కార్యక్రమంలో ఆడారి ఆత్మారామ్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



ఓవర్‌లోడుతో వాహనాలు నడిపితే కఠిన చర్యలు

మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజన్న

అనకాపల్లి రూరల్, జనవరి 5: ఓవర్‌లోడుతో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజన్న హెచ్చరించారు. కొండకొప్పాక జిల్లా రవాణా శాఖ కార్యాలయం ఎదుట శుక్రవారం వాహనాల తనిఖీలను ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టీపీసీ నుంచి సబ్బవరం వైపు ఫ్లయాస్ లోడుతో వెళుతున్న భారీ వాహనాలను తనిఖీలు చేశారు. టార్పాలిన్ లేకుండా లోడును తరలిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వాహనాలకు జరిమానాలు విధించారు. అలాగే పరిమితికి మించి అధిక బరువును తరలిస్తున్న వాహనాలను నిలిపివేసి జరిమానాలు విధించారు. అలాగే టూవీలర్ వాహనదారులను నిలిపి వేసి హెల్మెట్ గురించి కలిగే ఉపయోగాలను రాజన్న వివరించారు. నాలుగు చక్రాల వాహనదారులను నిలిపివేసి సీటుబెల్ట్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ మురళీకృష్ణ పాల్గొన్నారు.



హెల్మెట్ పెట్టుకోవాలని సూచిస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజన్న

కనకమ్మ ఆలయంలో లక్ష పుష్పార్చన

ఎలమంచిలి, జనవరి 5: ఎలమంచిలి ధర్మవరం కనకమహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం 1008 మంది భక్తులచే లక్ష పుష్పార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్గశిర మాసం ప్రత్యేక శుక్రవారం తెల్లవారు నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.



లక్ష పుష్పార్చనలో పాల్గొన్న 1008 మంది భక్తులు

'వయో వృద్ధులకు రాయితీలు కల్పించాలి'

అనకాపల్లి టౌన్, జనవరి 5 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వృద్ధులకు రాయితీలు కల్పించాలని జిల్లా వయో వృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కాండ్రేగుల అప్పారావు కోరారు. శుక్రవారం వీవీ రమణ రైతుభారతి హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ, రైల్వే ప్రయాణాల్లో వయో వృద్ధులకు రాయితీలను కల్పించాలని కోరారు. ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో బుద్ద అప్పారావు, ఎస్.రమేష్, పి.సత్యారావు, ఎంఎస్ఎస్ అప్పారావు, ఎస్. ఆదినారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

'ఆర్టీసీ రిటైర్డు కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి'

తుమ్మపాల, జనవరి 5 : ఆర్టీసీ రిటైర్డు కార్మికులకు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆర్టీసీ రిటైర్డు ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు విత్తనాల పోతురాజు డిమాండ్ చేశారు. శుక్రవారం రిటైర్డు ఎంప్లాయీస్‌తో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు జగన్మోహన్‌రెడ్డి తమకు పలు హామీలు ఇచ్చి ఇప్పుడు మరిచిపోవడం అన్యాయమన్నారు. తక్షణమే యాక్టు 95 ప్రకారం మూడు వేల రూపాయలు పింఛన్‌ను అందించాలన్నారు. సూపర్ లగ్జరీ బస్సుల్లో ఆర్టీసీ రిటైర్డు ఎంప్లాయీస్ కుటుంబాలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

గురుకుల పాఠశాలకు ఫ్యాన్లు వితరణ

తుమ్మపాల, జనవరి 5 : పట్టణంలోని గవరపాలెం బీసీ గురుకుల పాఠశాలకు శుక్రవారం స్థానిక నాయకుడు కాండ్రేగుల శ్రీరామ్ తన సొంత నిధులతో ఫ్యాన్‌లను అందించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ విద్యార్థులంతా ఉన్నత విద్యనభ్యసించి లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయులు శ్రీరామ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వర్లు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కర్రి గంగాధర్, ఉపాధ్యాయులు మహేంద్ర పట్నాయక్ పాల్గొన్నారు.

లాలంకోడూరు జడ్‌పీ హైస్కూల్ తనిఖీ

రాంబిల్లి, జనవరి 5: మండలంలోని లాలంకోడూరు జడ్పీ హైస్కూల్‌ను శుక్రవారం జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి. అప్పారావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఆయన విద్యార్థులతో మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ఎం.సూర్యనారాయణ, హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలు వలస

... 5వ పేజీ తరువాయి

పండగ వరకు పనులు చేసుకుంటే ఇద్దరు సభ్యులున్న కుటుంబానికి రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు కూలి డబ్బులు వస్తాయని, దీంతో పండుగను బాగా జరుపుకోచ్చని వ్యవసాయ కూలీలు సాలాపు అప్పారావు, రాము,, సత్తమ్మ, కర్రి అప్పయ్యమ్మ బుల్లి, గల్లా లక్ష్మి, సాలాపు మణెమ్మ తదితరులు తెలిపారు. గతంలో డిసెంబరు నుంచే ఉపాధి పనులు కల్పించేవారని, ఈ ఏడాది జనవరి వచ్చినా ఉపాధి పనులు చూపించకపోవడంతో కడుపు చేతపట్టుకుని వలసపోతున్నామన్నారు. కాగా ఉపాధి పనులు ఇంకా మొదలు పెట్టకపోవడంపై ఏపీవో కాశీని వివరణ కోరగా, కొన్ని పంచాయతీల్లో ఉపాధి పనులు ఇంకా గుర్తించలేదని, మరికొన్ని పంచాయతీల్లోని చెరువుల్లో నీరు ఉండడం వల్ల మట్టి పనులకు అవకాశం లేదని చెప్పారు.

పార్టీ అండగా ఉంటుంది

... 5వ పేజీ తరువాయి

చిత్ర పటానికి నివాళులర్పించారు. ఆయన భార్య పార్వతిదేవి, కుమారులు వెంకట్రావు, ప్రభాకర్, సుధాకర్‌లను పరామర్శించిన ఆమె అండగా తామున్నామంటూ ధైర్యాన్నిచ్చారు. కష్టకాలంలో తమ కుటుంబానికి అండగా నిలవడంతో పాటు టీడీపీ అభివృద్ధికి అహర్నిశలూ శ్రమిస్తున్న నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు తాము అన్ని వేళలా అండగా నిలుస్తామన్నారు. రాధాకృష్ణ కుటుంబానికి రూ.3 లక్షల చెక్‌ను అందజేశారు. ఇదిలావుండగా పాతగాజువాకలో నారా భువనేశ్వరికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. భువనేశ్వరి వెంట ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, పంచుమర్తి అనురాధ, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, నజీర్, చిక్కాల విజయ్, అనంతలక్ష్మి, కార్పొరేటర్‌లు పల్లా శ్రీనివాసరావు, గంధం శ్రీనివాసరావు, పులి లక్ష్మీబాయి, నాయకులు నల్లూరు సూర్యనారాయణ, పులి వెంకటరమణారెడ్డి, తదితరులు ఉన్నారు.

రాజ్యసభకు పంపించాలనే జోగులను నియమించారు

» ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్. రాయవరం, జనవరి 5: తనను రాజ్యసభకు పంపించే ఆలోచనలో ముఖ్యమంత్రి ఉన్నారని, అందుకే రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులను ఇక్కడ ఇన్‌చార్జిగా నియమించారని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు తెలిపారు. మండలంలోని గుడివాడలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే బాబూరావు, రాజాం ఎమ్మెల్యే జోగులతో కలిసి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ తనకు రాజ్యసభకు పంపించినా.. మరే ఇతర పదవి ఇచ్చినా నియోజవర్గంలోనే నివాసం ఉంటానన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి డాక్టర్ మహేష్, ఎంపీపీ కోన లోవలక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు బాబూరావు, జోగుల

అభిజిత్ కార్మికులకు టీడీపీ మద్దతు

అచ్యుతాపురం రూరల్, జనవరి 5 : ఎస్ఈజెడ్‌లోని అభిజిత్ ఫెర్రోఎల్లోయిస్ కార్మికులు చేస్తున్న నిరసనకు టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, నాయకులు శుక్రవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రగడ మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన సమస్యలను కంపెనీ యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తర్వాత ప్రగడ నాగేశ్వరరావుతోపాటు టీడీపీ నేతలు కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లాలం నాగేశ్వరరావు, నీరుకొండ నరసింగరావు, అప్పలనాయుడు, రాజాన రామునాయుడు పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

టీడీపీ నేత ప్రసాద్‌ను పరామర్శించిన దిలీప్‌చక్రవర్తి

రాంబిల్లి, జనవరి 5 : ప్రమాదంలో గాయపడి తన నివాసంలో వైద్యసేవలు పొందుతున్న పెదకలవలాపల్లి టీడీపీ నేత కర్రిసింహగిరి ప్రసాద్‌ను శుక్రవారం భైరా ఫౌండేషన్ చైర్మన్ దిలీప్‌చక్రవర్తి, టీడీపీ నేతలు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసాద్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వి.దినబాబు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర, మాజీ సర్పంచ్‌లు చోడిపల్లి సత్యనారాయణ, బద్ది నారాయణరావు, తదితరులు ఉన్నారు.

న్యాయవాదుల బైక్ ర్యాలీ

ఎలమంచిలి, జనవరి 5 : ప్రజల స్థిరాస్తులకు నష్టం కలిగించే ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టును నిరసిస్తూ పట్టణంలో శుక్రవారం న్యాయవాదులు బైక్ ర్యాలీ చేపట్టారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బస్టాండ్ జంక్షన్ నుంచి ప్రధాన రోడ్డు మీదుగా ర్యాలీ చేశారు.కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శిలు ఎస్.శ్రీనివాస పట్నాయక్, కూనిశెట్టి శ్రీనివాస్, న్యాయవాదులు లాలం రమణమూర్తి, టి.సత్యనారాయణ, దూళి నూకరాజు, శ్రీనివాస పట్నాయక్, పీవీ. రమణ పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్‌లో.. భూ హక్కుల యాజమాన్య చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం కూడా రిలే దీక్షలను కొనసాగించారు.ఈ దీక్షల్లో న్యాయవాదులు రాపేటి బాలగంగాధర్ తిలక్, అంగులూరి వెంకటేశ్వరరావు, ఆళ్ల ప్రసాద్, దువ్వూరి లక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శేఖరమంత్రి సాయి వెంకట లక్ష్మణరావు, తదితరులు కూర్చున్నారు.

శ్రీరాంపురంలో కబ్జా అయిన ప్రభుత్వ భూమి స్వాధీనం

పాయకరావుపేట రూరల్, జనవరి 5: మండలంలోని శ్రీరాంపురంలో 17/1 నంబరులో కబ్జా అయిన ప్రభుత్వ భూమిని శుక్రవారం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ భూమిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ గారా కృష్ణప్రసాద్ ఈ ప్రభుత్వ భూమిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని జిల్లా అధికారులను కోరారు. ఎట్టకేలకు స్పందించిన రెవెన్యూ అధికారులు గ్రామంలోని సర్వే నంబరు 17/1లో పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చేందుకు గుర్తించారు. దీంతో శుక్రవారం రెవెన్యూ అధికారులు ఆ స్థలంలో ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

కొత్తూరులో అక్రమ కట్టడాలపై దృష్టి సారించండి

» సర్పంచ్‌కు గ్రామస్థుల వినతి

కొత్తూరు, జనవరి 5 : కొత్తూరులో అక్రమ కట్టడాలపై దృష్టి సారించాలని గ్రామస్థులు సర్పంచ్ సప్పారపు ప్రసన్న లక్ష్మిని కోరారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో స్థానికంగా ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. దీనిపై సర్పంచ్ స్పందిస్తూ అక్రమ కట్టడాలను తాము ఏ రూపంలోనూ ప్రోత్సహించమని చెప్పారు. ఎటువంటి అక్రమ కట్టడాలు జరిగినా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు జోసెఫ్, ఎంపీటీసీ సభ్యురాలు సంతోషి తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయంలో ధనుర్మాస వేడుకలు



వెంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న పాలకవర్గం

అనకాపల్లి టౌన్, జనవరి 5: స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయంలో శుక్రవారం ధనుర్మాస వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో తెల్లవారుజామున ఐదున్నర గంటలకు వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 400 మందికి అన్నదాన ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రత్నాకర్‌కు అభిమానులు ఘన స్వాగతం

అనకాపల్లి టౌన్, జనవరి 5 : తెలుగుదేశం పార్టీలో చేరిన మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, ఆయన కుమారుడు రత్నాకర్ శుక్రవారం అనకాపల్లికి తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా యువ నాయకుడు రత్నాకర్‌ను ఆయన అభిమానులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. శుక్రవారం ఉదయం ఉండవల్లిలో చంద్రబాబు నివాసానికి వీరభద్రరావు, రత్నాకర్ ప్రత్యేకంగా వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా చంద్రబాబును రత్నాకర్ సత్కరించి జ్ఞాపికను అందజేశారు. గత అనుబంధాలు, అనుభవాలను గుర్తు చేసుకున్నట్టు డీవీఆర్ కార్యాలయం పేర్కొంది. తెలుగుదేశం పార్టీ చేపట్టబోయే పోరాట యాత్రలపై సుదీర్ఘంగా చర్చించారు.



చంద్రబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న రత్నాకర్

పేదలకు వస్త్రాలు పంపిణీ



పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న లక్ష్మీనారాయణ

అనకాపల్లి టౌన్, జనవరి 5 : మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. స్థానిక నిదానందొడ్డి ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద గురువారం రాత్రి వర్తకసంఘం అధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణ పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కర్రి సత్యనారాయణ, చదరం నాగేశ్వరరావు, బుద్ద రాజేష్, పీలా నాగశ్రీను, పీలా నాని, సందీప్, రాముడు, మాధవ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు

పరవాడ, జనవరి 5 : మండలంలోని నాయుడుపాలెం, వాడచీపురుపల్లి, పరవాడల్లో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధనుర్మాసం సందర్భంగా మేలుకొలుపు కార్యక్రమాన్ని శుక్రవారం తెల్లవారుజామున నిర్వహించారు. ఐదు గంటల నుంచి సీతారాముల విగ్రహాలను పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కూండ్రపు ముత్యాలనాయుడు, బాబూరావు, ఈశ్వరరావు, సూరిబాబు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రైతుల దీక్షలు

పరవాడ, జనవరి 5: మండల కేంద్రంలోని పెద్ద చెరువు ఆయకట్టు రైతులు చేపడుతున్న దీక్షలు శుక్రవారానికి 27వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతులు రాంకీ యాజమాన్యం తీరుపై మండిపడ్డారు. కార్యక్రమంలో రైతులు ఎస్ఎస్ నాయుడు, పైలా నాయుడు, బండారు రామారావు పాల్గొన్నారు.

కంటి పరీక్షలపై డిగ్రీ విద్యార్థులకు అవగాహన

నక్కపల్లి, జనవరి 5: నేత్ర వైద్య పరీక్షలపై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు శుక్రవారం హెటిరో ఔషధ పరిశ్రమ ఆస్పత్రి వైద్యులు అవగాహన కల్పించారు. డిగ్రీ విద్యార్థులు తమ ప్రాజెక్ట్ రూపకల్పనలో భాగంగా హెటిరో కంటి వైద్యశాలను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ వైద్యులు కంటి వైద్య పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ అచ్యుతరావు, లెక్చరర్ ఎం.గణేశ్, హెటిరో ప్రతినిధి సీహెచ్ శ్రీనివాసరావు, కంటి వైద్యశాల సిబ్బంది రమాదేవి, నరేశ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరశురాముడుగా పాండురంగడు

పాయకరావుపేట, జనవరి 5: స్థానిక పాండురంగస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం పాండురంగ స్వామి పరశురామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు యి.కృష్ణస్వామి స్వామివారికి సుప్రభాతసేవ, విశేష పూజల అనంతరం నూతన వస్త్రాలు, విల్లుంబు ధరింపచేసి పరశురామునిగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎస్.వెంకటాద్రి, అర్చకులు యి.నారాయణాచార్యులు, సిబ్బంది సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



పరశురామావతారంలో..

టెన్త్ విద్యార్థులు ఒత్తిడి లేకుండా చదవాలి

» గురుకుల పాఠశాల రిటైర్డ్ టీచర్ ఎంవీ రామకృష్ణ

నక్కపల్లి, జనవరి 5: టెన్త్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు ఒత్తిడి లేకుండా చదవాలని, అందుకు అనువైన వాతావరణం ఇంటి వద్ద ఏర్పాటు చేసుకోవాలని గురుకుల పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయుడు ఎంవీ రామకృష్ణ చెప్పారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఎంవీ రామకృష్ణ శుక్రవారం పీఆర్‌టీయూ జిల్లా ప్రతినిధి డీవీఎస్‌రావు వినతి మేరకు రాజయ్యపేట హైస్కూల్‌ను సందర్శించారు. టెన్త్ విద్యార్థులకు విలువైన సూచనలు చేశారు. పరీక్షలకు ఇంకా రెండు నెలలు సమయం వుందని, అందువలన విద్యార్థులు టెన్షన్ లేకుండా ప్రశాంతంగా, ఏకాగ్రతగా చదవాలని సూచించారు. ప్రధానంగా పోషకాహారం తీసుకోవాలని, టీవీలు, మొబైల్ ఫోన్లకు పరీక్షలు ముగిసేవరకు ఫుల్‌స్టాప్ పెట్టాలన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణను హెచ్‌ఎం నారాయణరావు, ఉపాధ్యాయులు సన్యాసిరావు సత్కరించారు.

పప్పలను కలిసిన దిలీప్ చక్రవర్తి

ఎలమంచిలి, జనవరి 5: ఎలమంచిలి టీడీపీ కార్యాలయంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావును భైరా ఫౌండేషన్ చైర్మన్ దిలీప్ చక్రవర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. పప్పలకు పుష్పగుచ్ఛాన్నిచ్చి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొద్దిసేపు చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మానాయుడు, షేక్ బషీర్, నేతలు పాల్గొన్నారు.

నరసింహమూర్తిని పరామర్శించిన సుబ్బారెడ్డి

నక్కపల్లి, జనవరి 5: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై విశాఖ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైసీపీ మండల అధ్యక్షుడు శీరం నరసింహమూర్తిని శుక్రవారం వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ చిక్కాల రామారావు పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకునేలా వైద్యసేవలు అందించాలని సుబ్బారెడ్డి వైద్యులను కోరారు.

పారిశుధ్య కార్మికులు పొర్లు దండాలు

▸ డిమాండ్లు పరిష్కరించాలని సీఎం జగన్‌కు వేడుకోలు ▸ వీధుల్లో చెత్త కదలకపోవడంతో తీవ్ర ఇబ్బందుల్లో జనం



నర్సీపట్నంలో పొర్లు దండాలతో నిరసన తెలియజేస్తున్న పారిశుధ్య కార్మికులు

నర్సీపట్నం, జనవరి 5 : డిమాండ్లపై పారిశుధ్య కార్మికులు చేపట్టిన ఆందోళనకు పరిష్కారం లభించకపోవడంతో వారు తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఎన్టీఆర్ మినీ స్టేడియంలో రిలే దీక్షలు చేపట్టిన వీరు శుక్రవారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పొర్లు దండాలు పెట్టి డిమాండ్లు పరిష్కరించాలని వేడుకున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కాగా పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మె 11వ రోజుకి చేరింది. దీంతో పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. వార్డుల్లో చెత్త పేరకుపోతుంది. డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయకపోవడంతో ఓ వైపు దుర్వాసన, మరో వైపు దోమల బెడదతో అంతా అవస్థలు పడుతున్నారు. రెగ్యులర్ సిబ్బంది విధుల్లో ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో సేవలు అందించ లేకపోతున్నారు. మునిసిపల్ అధికారులు వీధుల్లో పేరుకు పోయిన చెత్తను తొలగించే ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అడిగర్ల రాజు, ఈరెల్లి చిరంజీవి, పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు శ్రీను పాల్గొన్నారు.

ఏఎల్‌పురంలో విధుల బహిష్కరణ

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో పారిశుధ్య కార్మికులు శుక్రవారం విధులను బహిష్కరించి, సచివాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. దీంతో గ్రామంలో రోడ్లపై ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్లతరబడి ఇక్కడ పదిమంది పనిచేస్తున్నామన్నారు. ఒక్కొక్కరికీ ఆరు వేల రూపాయలు వేతనంగా ఇస్తున్నారని, ప్రస్తుత ధరల దృష్ట్యా ఇది ఏ మేరకు సరిపోతుందని ప్రశ్నించారు. కనీస నెలకు వేతనం రూ.18 వేలు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఇప్పటికే పలుమార్లు అధికారులు, పాలకులు హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదన్నారు. ఇప్పటికైనా స్పందించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్మిక సంఘం అధ్యక్షుడు రాజు, కార్యదర్శి దేవత తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

▸ 25వ రోజు వినూత్న రీతిలో నిరసన ▸ రోలుగుంట దీక్షా శిబిరంలో స్పృహ కోల్పోయిన కార్యకర్త ▸ ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్సలు



బుచ్చెయ్యపేటలో చెవుల్లో పూలు పెట్టుకుని ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

బుచ్చెయ్యపేట, జనవరి 5 : డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన ఆందోళన రోజుకో విధంగా సాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం చెవుల్లో పూలు పెట్టుకుని వారంతా నిరసన తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే అమలు చేయాలని కోరారు. సమ్మెపై ప్రభుత్వం బెదిరింపులకు దిగుతుండడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకురాలు ఎలిశెట్టి అమ్మాజీ, కోవెల వెంకటలక్ష్మి, ఆది వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం : అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ నిర్వహిస్తున్న సమ్మె శుక్రవారం 25వ రోజుకు చేరుకుంది. ఇక్కడి ఎన్టీఆర్ మినీ స్టేడియంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద రిలేదీక్షలు చేపట్టారు. వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సామ్రాజ్యం, కృష్ణవేణి, శోభ తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట : అంగన్‌వాడీల సమ్మె గురువారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా రోలుగుంట తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిబిరానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి అంగన్‌వాడీలు విచ్చేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పడాలపాలెం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త పద్మ అస్వస్థకు గురై శిబిరం వద్ద కుప్పకూలారు. వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యసేవల నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి పంపారు. అక్కడి నుంచి విశాఖలో ఆస్పత్రికి వైద్యులు తరలించారు. అక్కడ ఐసీయూలో చికిత్సలు పొందుతున్నట్టు అంగన్‌వాడీ కార్యకర్తలు ఇక్కడి విలేకరులకు తెలిపారు.

మాడుగుల : డిమాండ్లు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు శుక్రవారం ఇక్కడ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరట నర్సింహమూర్తి వీరికి సంఘీభావం తెలిపి మాట్లాడారు. సమస్యలపై అంగన్‌వాడీలు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



మాడుగులలో డిమాండ్లపై నినాదాలు చేస్తున్న దృశ్యం



రోలుగుంటలో స్పృహ కల్పోయిన కార్యకర్త పద్మను ఆస్పత్రికి తరలింపు

మురుగు సమస్యపై పాకలపాడులో ఆగ్రహం

▸ వైసీపీ నాయకుడ్ని నిలదీసిన రామాలయం వీధివాసులు



మురుగు సమస్యపై ఎంపీటీసీ భర్తను ప్రశ్నిస్తున్న గ్రామస్థులు

గొలుగొండ, జనవరి 5 : కాలువలో మురుగు పారేందుకు అడ్డంకులు తొలగించాలంటూ మండలంలోని పాకలపాడు రామాలయం వీధివాసులు శుక్రవారం వైసీపీ నాయకుడ్ని నిలదీశారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. రామాలయం వీధిలో ఉంటున్న వైసీపీకి చెందిన గొల్లి నారాయణమూర్తి తన పొలం పైకి మురుగునీరు వస్తుందని డ్రైనేజీ కాలువకు అడ్డంగా సోదరుడితో కలిసి చిన్నపాటి గట్టు వేశారు. దీంతో గ్రామంలో రోడ్లకు ఇరువైపులా ఉన్న కాలువల్లో మురుగు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. దోమలతో పాటు దుర్వాసన వెదజల్లుతుండడంతో సర్పంచ్ రాజాన పద్మకు అక్కడివారు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఫలితం లేకపోయింది. ఇదిలావుంటే, ఈ సమస్యపై శుక్రవారం ఆ వీధి వాసులు వైసీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు భర్త నాయుడును నిలదీశారు. మురుగు వాసనను భరించలేకపోతున్నామని వాపోయారు. దీంతో ఆయన నారాయణమూర్తిని కలిసి మురుగు పారేందుకు సదరు గట్టును తొలగించాలని కోరారు. దీనికి అతడు నిరాకరించడంతో ఎంపీడీవో డేవిడ్‌రాజ్‌కు ఎంపీటీసీ భర్త ఈ సమస్యపై ఫిర్యాదు చేశారు.

నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు : బూడి



మాడుగుల- సాగరం సీసీ రోడ్డు ప్రారంభోత్సవంలో బూడి

మాడుగుల/ మాడుగుల రూరల్, జనవరి 5 : కోట్లాది రూపాయలతో నియోజకవర్గంలో ఎన్నెన్నో అభివృద్ధి పనులు చేపట్టినట్టు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. మండల కేంద్రం మాడుగులతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను శుక్రవారం అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సేనాపతి కొండలరావుతో ప్రమాణం చేయించారు. ఎంపీపీ రామధర్మజ, వైస్ ఎంపీపీలు రాజారామ్, శ్రీనివాసు, వైసీపీ నాయకులు బొమ్మిశెట్టి శ్రీను, సత్తిబాబు, దేవరాపల్లి శ్రీను, పరమేశ్, గొల్లవిల్లి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

యోగాసనాలతో విద్యార్థుల్లో మరింత ఏకాగ్రత



చోడవరం, జనవరి 5 : యోగా ద్వారా విద్యార్థులకు ఏకాగ్రత మరింత పెరగడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుల్లేటి సతీష్ తెలిపారు. శుక్రవారం ఇక్కడి భాష్యం స్కూల్‌లో విద్యార్థులకు యోగా శిక్షణ తరగతులను ప్రారంభించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.సంతోష్‌కుమార్, ప్రధానోపాధ్యాయిని కావ్య, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి'



గ్రామ సభలో మాట్లాడుతున్న ఎస్ఐ ధనుంజయనాయుడు

నర్సీపట్నం అర్బన్, జనవరి 5 : చెడు వ్యసనాలకు అంతా దూరంగా ఉండాలని నర్సీపట్నం రూరల్ ఎస్ఐ ధనుంజయనాయుడు సూచించారు. వేములపూడిలో శుక్రవారం ఏర్పాటైన గ్రామ సభలో మాట్లాడారు. దొంగతనాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అంతా ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ స్పాట్ ఇన్‌చార్జి కె.శ్రీనివాసరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పింఛన్లు పంపిణీ

నర్సీపట్నం అర్బన్, జనవరి 5 : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం కొత్తగా మంజూరైన, పెరిగిన పింఛన్ల నగదును ఎమ్మెల్యే గణేశ్ పలువురు లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, ఎంపీడీవో జయమాధవి, వైసీపీ మండల అధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, నాతవరం మండలం మాధవనగరానికి చెందిన పలువురు వైసీపీలో చేరడంతో వారికి ఎమ్మెల్యే గండువాలు కప్పి ఆహ్వానించారు.

కన్నంపాలెంలో....

చోడవరం: మండలంలోని కన్నంపాలెంలో శుక్రవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ భైన ఈశ్వరరావు చేతుల మీదుగా పలువురు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తుంపాల సత్యారావు, సాలాపు అప్పలనాయుడు, పల్లా మోదినాయుడు, భైన బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆలయ అభివృద్ధికి విరాళం



చెక్కు అందిస్తున్న కృష్ణ

మాడుగుల రూరల్, జనవరి 5 : మండలంలోని ఎం. కోడూరులో మోదకొండమ్మ ఆలయ గాలిగోపురం, అభివృద్ధి పనులకు ఇదే గ్రామానికి చెందిన జనసేనపార్టీ నియోజకవర్గ సమన్వయకర్త రాయపురెడ్డి కృష్ణ శుక్రవారం రూ.25 వేలను విరాళంగా అందజేశారు. తొలుత ఆయన ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు, గొల్లవిల్లి ప్రభావతి, పడాల అప్పలనాయుడు, రాజేశ్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

కాగితాలకే చోడవరం అభివృద్ధి పరిమితం

▸ ఎమ్మెల్యే ధర్మశ్రీ ప్రకటనలపై తాతయ్యబాబు ఆగ్రహం

▸ వైసీపీ పాలనలో వైఫల్యాల చిట్టా విప్పిన టీడీపీ నాయకుడు



విలేకర్లతో మాట్లాడుతున్న తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, జనవరి 5 : చోడవరం నియోజకవర్గ అభివృద్ధి కాగితాలకే పరిమితమైందని, ఇందుకు ఎమ్మెల్యేగా ఉన్న కరణం ధర్మశ్రీ అసమర్థతే కారణమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు ఆరోపించారు. శుక్రవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ధర్మశ్రీ అసమర్థత వల్ల రెండేళ్లుగా బీఎన్ రోడ్డు అభివృద్ధి పనులు సాగుతున్నాయని ఎద్దేవా చేశారు. బీఎన్ రోడ్డు పనులను 2023 డిసెంబరు నెలాఖరులోగా పూర్తిచేస్తామని సాక్షాత్తు వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ధర్మశ్రీ సంయుక్తంగా చేసిన ప్రకటన మోసపూరితంగానే మిగిలిందన్నారు. కాగా నేడు ధర్మశ్రీ బీఎన్ రోడ్డు అభివృద్ధి పనుల పూర్తిపై మరోమారు ప్రకటన చేయడం తగదని ఆయన మండిపడ్డారు. ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటన ఏదని ప్రశ్నించారు. యువతకు ఉపాధి కల్పన నిమిత్తం నియోజకవర్గానికి హబ్‌గా గుర్తింపు తీసుకొస్తామని ధర్మశ్రీ ప్రకటన చేయడం సిగ్గుచేటుగా పేర్కొన్నారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి చెరకు రైతుల బకాయిల చెల్లింపు నిమిత్తం ప్రభుత్వం నుంచి రూ.12.5 కోట్లు గ్రాంటు మంజూరు చేయించానని మూడు నెలలుగా ధర్మశ్రీ చెప్పుకొస్తున్నారన్నారు. కానీ నేటికీ చెరకు రైతుల అకౌంట్‌లలో నగదు ఎందుకు జమకాలేదో సమాధానం చెప్పాలని నిలదీశారు. వడ్డాది వంతెన దెబ్బతిని 22 నెలలు కావస్తున్నా నూతన వంతెన ఊసే లేకుండా పోయిందన్నారు. ఇలా అన్నిరంగాల్లో ధర్మశ్రీ విఫలమయ్యారని తాతయ్యబాబు ఆరోపించారు. వీటన్నింటినీ గమనిస్తున్న ప్రజలు రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

నియోజకవర్గాన్ని ఏం అభివృద్ధి చేశారు?

▸ ఎమ్మెల్యే గణేశ్‌ను ప్రశ్నించిన జనసేన నాయకులు



గాంధీ విగ్రహం వద్ద పార్టీ శ్రేణుల ఆందోళన

నర్సీపట్నం అర్బన్ , జనవరి 5 : నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకరగణేశ్ అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని జనసేన పార్టీ నాయకులు హితవు పలికారు. ఎమ్మెల్యే ప్రకటనలను నిరసిస్తూ శుక్రవారం ఇక్కడి ఎన్టీఆర్ స్టేడియంలోని గాంధీ విగ్రహం వద్ద ఆ పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ సమన్వయకర్త రాజాన వీరసూర్యచంద్ర ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం లో వైద్య కళాశాల ఏర్పాటుకు కేంద్రం అనుమతులు లేవన్నారు. ఉంటే ప్రజలకు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. తాండవ రిజర్వాయర్ ఏలూరు కాలువకు అనుసంధానం హామీ ఏమైందని ప్రశ్నించారు. నాలున్నరేళ్లలో గుంతల రోడ్లు ఎమ్మెల్యేకు కనిపంచలేదా.. అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అద్దేపల్లి గణేష్, గండెం దొరబాబు, నమ్మిన రమణరాజు, గూడుపు రజబాబు పాల్గొన్నారు.

మంచాల మోడల్ హాస్టల్‌లో అమలుకాని మెనూ

▸ కట్టెలపొయ్యిపైనే వంటలు

▸ మధ్యాహ్నం మూడుగంటల వరకూ బాలికలకు పెట్టని భోజనం

▸ జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్తా : ఎంపీపీ జయమ్మ



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న ఎంపీపీ జయమ్మ

చీడికాడ, జనవరి 5 : మండలంలోని మంచాల మోడల్ స్కూల్ హాస్టల్‌లో మెనూ అమలుకాకపోగా, బాలికలకు సకాలంలో భోజనాలు పెట్టకపోవడంతో ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మిపై ఎంపీపీ జయమ్మ మండిపడ్డారు. మోడల్ స్కూల్ హాస్టల్‌లో 95మంది బాలికలు విద్యాభ్యాసం చేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటలకు ఎంపీపీ జయమ్మ హాస్టల్‌ను తనిఖీ చేశారు. ముందుగా ఆరుబయట కట్టెల పొయ్యిపై చేస్తున్న వంటలను పరిశీలించిన అనంతరం మెనూ చార్టును పరిశీలించారు. ఉదయం పెట్టాల్సిన బెల్లం రాగిజావ, చపాతి పిల్లలకు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. గ్యాస్‌పై వంటలు చేయాల్సి ఉన్నా కర్రల పొయ్యిపై వంటలు చేయడం ఏమిటన్నారు. మధ్యాహ్నం 1.30 గంటలైనా కూర, పప్పు పూర్తికాగా, రసం ఇంకా పూర్తికాలేదు. ఇక అన్నం ఎప్పుడు వండుతారని ప్రశ్నించారు. మధ్యాహ్నం 3గంటల వరకూ భోజనాలు పెట్టకపోతే పిల్లలు ఎలా ఉండగలరని ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ గ్యాస్ రాకపోవడం వలన కర్రల పొయ్యిపై వంటలు చేయించానని, భవిష్యత్తులో ఇలా జరగకుండా చూస్తానని వివరించారు.

శిరిజాంలో 312మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు

చీడికాడ, జనవరి 5 : శిరిజాం ప్రభుత్వ పాఠశాలలో 312మందికి వైద్యాధికారులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. తొలుత ఈ శిబిరాన్ని ఎంపీపీ జయమ్మ, సర్పంచ్ కన్నూరు సత్యవతి, ఎంపీటీసీ ఈర్లె దేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం ఆరోగ్య పరిరక్షణకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయప్రకాశరావు, పంచాయతీ కార్యదర్శి పీలా పద్మవతి, వైసీపీ నాయకులు లాలం జానకీరామ్, ఈర్లె నాయుడు, కన్నూరు చెల్లంనాయుడు, కురచా నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలు వలస

... 5వ పేజీ తరువాయి

పండగ వరకు పనులు చేసుకుంటే ఇద్దరు సభ్యులున్న కుటుంబానికి రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు కూలి డబ్బులు వస్తాయని, దీంతో పండుగను బాగా జరుపుకోచ్చని వ్యవసాయ కూలీలు సాలాపు అప్పారావు, రాము,. సత్తమ్మ, కర్రి అప్పయ్యబుల్లి, గల్లా లక్ష్మి, సాలాపు మణెమ్మ తదితరులు తెలిపారు. గతంలో డిసెంబరు నుంచే ఉపాధి పనులు కల్పించేవారని, ఈ ఏడాది జనవరి వచ్చినా ఉపాధి పనులు చూపించకపోవడంతో కడుపు చేతపట్టుకుని వలసపోతున్నామనారు. కాగా ఉపాధి పనులు ఇంకా మొదలు పెట్టకపోవడంపై ఏపీవో కాశీని వివరణ కోరగా, కొన్ని పంచాయతీల్లో ఉపాధి పనులు ఇంకా గుర్తించలేదని, మరికొన్ని పంచాయతీల్లోని చెరువుల్లో నీరు ఉండడం వల్ల మట్టి పనులకు అవకాశం లేదని చెప్పారు.

పార్టీ అండగా ఉంటుంది

... 5వ పేజీ తరువాయి

చిత్ర పటానికి నివాళులర్పించారు. ఆయన భార్య పార్వతిదేవి, కుమారులు వెంకట్రావు, ప్రభాకర్, సుధాకర్‌లను పరామర్శించిన ఆమె అండగా తామున్నామంటూ ధైర్యాన్నిచ్చారు. కష్టకాలంలో తమ కుటుంబానికి అండగా నిలవడంతో పాటు టీడీపీ అభివృద్ధికి అహర్నిశలూ శ్రమిస్తున్న నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు తాము అన్ని వేళలా అండగా నిలుస్తామన్నారు. రాధాకృష్ణ కుటుంబానికి రూ.3 లక్షల చెక్‌ను అందజేశారు. ఇదిలావుండగా పాతగాజువాకలో నారా భువనేశ్వరికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. భువనేశ్వరి వెంట ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, పంచుమర్తి అనురాధ, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, నజీర్, చిక్కాల విజయ్, అనంతలక్ష్మి, కార్పొరేటర్‌లు పల్లా శ్రీనివాసరావు, గంధం శ్రీనివాసరావు, పులి లక్ష్మిబాయి, నాయకులు నల్లూరు సూర్యనారాయణ, పులి వెంకటరమణారెడ్డి, తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు



సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త నాగేంద్ర ప్రసాద్

కృష్ణాదేవిపేట, జనవరి 5 : ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చునని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్ అన్నారు. గింజర్తి జంక్షన్‌లో గల పెట్ల నారాయణ మూర్తి పొలంలో శుక్రవారం పలువురు రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంలోని తొమ్మిది ప్రాథమిక సూత్రాలను కచ్చితంగా పాటించడం ద్వారా రైతులు పెద్దగా పెట్టుబడి లేకుండా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ స్వరాజ్యసమితి సమన్వయకర్త వైబీనాయుడు, టీడీపీ నాయకులు పెట్ల నారాయణమూర్తి, అదపురెడ్డి ప్రభాకరరావు, గెడ్డం సత్యనారాయణ, లగుడు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'గున్నెంపూడిలో రైతు గర్జన సభ రేపు'



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీవీఎస్ఎన్ రాజు

బుచ్చెయ్యపేట, జనవరి 5 : జగన్ పాలనలో రైతులు పడుతున్న కష్టాలపై జనసేన ప్రత్యక్ష పోరాటం చేస్తుందని ఆ పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు తెలిపారు. గున్నెంపూడిలో ఆదివారం జరగనున్న రైతు గర్జన భారీ బహిరంగ సభ పోస్టర్‌ను శుక్రవారం ఇక్కడ ఆవిష్కరించి మాట్లాడారు. జగన్ సర్కార్ వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ఒకప్పుడు ప్రగతి సాధించిన గోవాడ షుగర్ ఫ్యాక్టరీని వైసీపీ పాలకుల పుణ్యామా అని నేడు అధమ స్థాయికి పడిపోయిందని వాపోయారు. రైతులపై పాలకుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ గున్నెంపూడిలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న రైతు గర్జన సభకు రైతులు, కర్షకులు, కార్మికులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. .

పుత్తడిగైరంపేటలో వైద్య సిబ్బంది ర్యాలీ

గొలుగొండ, జనవరి 5 : ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పుత్తడిగైరంపేటలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి పలువురికి పరీక్షలు జరిపారు. ఎంపీపీ జి. మణికుమారి, జడ్పీటీసీ సుర్ల వెంకటగిరిబాబు, ఎంపీడీవో డేవిడ్‌రాజ్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్యామ్, సర్పంచ్ పత్తి రమణ తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం : ప్రజల చెంతకే వైద్య సేవలు అందిస్తున్నట్టు ఎంపీపీ సత్యనారాయణ తెలిపారు. రాచపల్లిలో శుక్రవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం వైద్య సిబ్బంది పలువురికి పరీక్షలు జరిపి మందులు అందజేశారు. జడ్పీటీసీ సత్యవేణి, ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఎంఈవో మూర్తి, వైసీపీ నాయకులు భద్రాచలం, గోవింద పాల్గొన్నారు.


విద్యార్థులకు స్టీల్ కంచాలు పంపిణీ



విద్యార్థులకు స్టీల్ కంచాలు అందిస్తున్న అమెరికన్లు

బుచ్చెయ్యపేట, జనవరి 5 : వడ్డాదిలోని మెయిన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం గాజువాక సీఎల్‌సీ చర్చి అధినేత మెహంతి వితరణగా అందజేసిన 140 స్టీల్ కంచాలను అమెరికాకు చెందిన ప్రతినిధులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహంతి తమ సంస్థ సేవలను వివరించారు. జడ్పీటీసీ దొండా రాంబాబు, హెచ్‌ఎం టి.వి.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లు సీజ్



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు చూపుతున్న ఎస్ఐ

బుచ్చెయ్యపేట, జనవరి 5 : ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న 99 మద్యం బాటిళ్లను శుక్రవారం పట్టుకున్నట్టు ఎస్ఐ డి.ఈశ్వరావు తెలిపారు. వడ్డాదిలో సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టగా, గండిబోయిన అప్పారావు నుంచి 93 క్వార్టర్ బాటిళ్లు, ఆరు బార్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. అలాగే కేబీ రోడ్డులో వడ్డాదికి చెందిన ఎలిశెట్టి మురళీకృష్ణ అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకుని రూ.10 వేలు అపరాధ రుసుం విధించినట్టు చెప్పారు. అదేవిధంగా చింతపాకలో సారా విక్రయిస్తున్న సలాది మత్స్యరాజును అరెస్టు చేసి, మూడు లీటర్ల సారాను సీజ్ చేశామన్నారు.

20 లీటర్ల సారాతో ఒకరి అరెస్టు

రావికమతం, జనవరి 5 : మండలంలోని పిల్లవాని పాలెంలో సారా విక్రయిస్తున్న బుదిరెడ్ల శివను శుక్రవారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా, 20 లీటర్ల నాటుసారాతో శివపట్టుబడినట్టు చెప్పారు. ఈ మేరకు నిందితుడ్ని అరెస్టు చేసి కోర్టుకు తరలించామన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రోలుగుంట, జనవరి 5 : మండలంలోని వెదుళ్లవలసలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ కాంతమ్మ శుక్రవారం శంకుస్థాపన చేశారు. గ్రామ శివారున ఉన్న ఈ గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు, మౌలిక వసతుల కల్పనకు కృషి చేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మాకవరపాలెం అధ్యక్షుడిగా రమణ

మాకవరపాలెం, జనవరి 5 : కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడిగా బొంతు రమణ నియమితులయ్యారు. ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడు నుంచి నియామక ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు తనవంతు కృషి చేస్తానన్నారు.